క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు



వివరాలు తెలుసుకుంటున్న ఎంఈఓ నవీద

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థుల సర్వే కార్యక్రమంలో 30 మందిని గుర్తించినట్లు మండల విద్యాధికారి నవీద తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని చేపల కాలనీలో జరుగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా చదువుతో పాటు ప్రభుత్వం ద్వారా వారికి కావాల్సిన పరికరాలను అందచేస్తామన్నారు. ఫిజియోథెరపీ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇంకా ఎవరైనా దివ్యాంగల విద్యార్థులుంటే ఎంఈఓ కార్యాలయంలో వివరాలు తెలియజేయాలన్నారు. ఇంటింటి సర్వే చేపట్టి దివ్యాంగ విద్యార్థును గుర్తించి వారికి ప్రత్యేక చదువులు చెప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు ఆదినారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చదరంగం పోటీల్లో ప్రతిభ



విజేతలకు బహుమతులందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక పెంగ్విన్ ఆక్టివిటీ క్లబ్‌లో గురువారం జరిగిన అండర్–15 టౌన్ లెవెల్ ఇంటర్‌స్కూల్స్ అమెచర్ చెస్ టోర్నమెంట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కేటగిరిల వారీగా జరిగిన పోటీల్లో సత్తాచాటిన ప్రియాంశు, నిజామ్ నదీమ్, సానియా, హాఫీష్, అమ్ములకు చెస్ ఆర్బిటర్ నాగార్జున కర్ణాటకం బహుమతులను అందజేశారు.

రేపు హనుమాన్ జయంతి

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి వద్ద ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. అదేరోజు సాయంత్రం 4 గంటల స్వామి రథోత్సవ ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: పట్టణంలోని కర్రెమ్మ గుడి, యల్లమ్మ గుడి, బ్రాహ్మణ వీధి అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఇప్పటికే సమయపాలన పాటించని 11 మంది అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు జారీ చేశామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

పామిడి: పట్టణ సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో గురువారం జనసేవ సొసైటీ, ధర్మ హ్యూమన్ రైట్స్ వ్యవస్థాపకుడు నరిశెట్టి ఆదిశేషు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈసందర్భంగా నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ వైద్య నిపుణులు 70 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 42 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఆపరేషన్ నిమిత్తం వారిని నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం సీపీఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ సీనియర్ నాయకులు తిమ్మప్ప, ఎస్‌కె.బాష జెండా ఆవిష్కరించి వందనం చేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రమేష్, నాయకులు దాసరి శ్రీనివాసులు, నాయకులు జాకీర్, జగదీష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంతటా అప్రమత్తం

- కౌంటింగ్ నేపథ్యంలో పోలీసుల కవాతు
- దుకాణాలు, హోటళ్లు, లాడ్జీల్లో విస్తృత తనిఖీలు
- ముందస్తుగా రౌడీషీటర్ల బైండోవర్

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత అల్లర్లను ప్రోత్సహించి, గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో పాటు ముందస్తుగా రౌడీ షీటర్లు బైండోవర్ చేస్తున్నారు. జూన్ 4న కౌంటింగ్ రోజు అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలంటూ సూచిస్తున్నారు. పోలీసుల హెచ్చరికను పాటించకుండా గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

యాడికి: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలకు ఇబ్బందులకు గురి చేసినా, పాత కక్షలతో గొడవలకు పాల్పడినా సహించేది లేదన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవ్వరూ ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదన్నారు. ఎన్నికల నిబంధనలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేస్ పోలీసులు పాల్గొన్నారు.

హోటళ్లు, లాడ్జీల్లో తనిఖీలు

పామిడి: పట్టణంలోని లాడ్జులు, హోటళ్లను గురువారం సీఐ ఎం.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. లాడ్జీలు, హోటళ్లలోనూ అపరిచిత, అనుమాన వ్యక్తుల గుర్తింపులో భాగంగా వారు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎన్నికల నియమావళి ప్రకారం 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎక్కడా గుంపుగూడరాదన్నారు. పోలీస్ యాక్ట్ 30 మేరకు సమావేశాలు, ర్యాలీలు చేపట్టరాదన్నారు. వాటిని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు

శింగనమల: కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని నాగులగుడ్డం, తండా, సి.బండమీదపల్లి గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం విజయ సంబరాలు, బాణసంచా కాల్చడం వంటివి నిషేధమన్నారు, ఎవరైనా అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం తెలిపిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చితంబరం, సిబ్బంది తిమ్మరాజు, అంజనేరెడ్డి, ధనుంజయ, సాయి, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

టపాసులు పేల్చి సంబరాలు చేస్తే చర్యలు

పెద్దవడుగూరు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, కౌంటింగ్ రోజు టపాసులు పేల్చి సంబరాలు చేయవద్దని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం మండలంలోని కండ్లగూడూరులో సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో కొన్ని గ్రామాల్లో గొడవలు జరిగాయని, అలాంటి వాటిని తీవ్రంగా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రజలందరూ కలిసి మెలసి ప్రశాంతంగా ఉండాలన్నారు.



పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమలు

గార్లదిన్నె: సార్వత్రిక ఎన్నిల కౌంటింగ్ సందర్భంగా జూన్ 4న మండలంలో అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. గురువారం ఎస్ఐ మండలంలోని గార్లదిన్నె, కోటంక, మర్తాడు, కల్లూరు, ఇల్లూరు తదితర సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, గొడవలు జరుగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అల్లర్లకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవన్నారు.

32 మంది బైండోవర్

పామిడి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టే కౌటింగ్ నేపథ్యంలో గురువారం అన్ని రాజకీయ పార్టీలకూ సంబంధించి 32 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. కౌటింగ్ తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా వారిని అదుపులోకి తీసుకున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ బెస్తరాజు సారథ్యంలో వారిని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు.



శింగనమల మండలం నాగులగుడ్డంలో పోలీసుల కవాతు



పామిడిలోని లాడ్జీలో తనిఖీ చేస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి



యాడికిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వైభవంగా కల్యాణోత్సవం



అలంకరణలో భావనా రుషీశ్వరులు

తాడిపత్రి అర్బన్: స్థానిక మార్కండేయస్వామి ఆలయంలో గురువారం భావనా రుషీశ్వర స్వామి కల్యాణోత్సవం వైభంగా నిర్వహించారు. బహుత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గడ్డం గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి పద్మశాలీయులందరూ పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయాన్నే సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు భక్తుల సమక్షంలో స్వామి కల్యాణోత్సవాన్ని వేద మంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ వీధుల్లో భక్తుల నడుమ స్వామి ప్రాకారోత్సవం నిర్వహించారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

గుత్తి: పట్టణంలోని శ్రీ బాలాజీ, హనుమాన్, చౌడేశ్వరి ఫర్టిలైజర్ షాపులను గురువారం ఏడీఏ వెంకటరాముడు, ఏఓ ముస్తాక్ అహమ్మద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు దుకాణాల్లోని రికార్డులు, స్టాక్ పరిశీలించారు. అలాగే విత్తన నిల్వలు గురించి ఆరా తీశారు. నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. విత్తనాలు, ఎరువుల విక్రయానికి సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్ షాపుల యజమానులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి తాపం తీర్చే తాటిముంజలు



విక్రయానికి సిద్ధంగా తాటిముంజలు



తాటిముంజలు విక్రయిస్తున్న వృద్ధుడు

తాడిపత్రి అర్బన్: తాటిముంజలు వేసవి సీజన్‌లో మాత్రమే లభించే పల్లెటూరి మధురాలు...కొందరు రైతులు నెల రోజులుగా తాటి ముంజలను యల్లనూరు, గుత్తి, పెద్దవడుగూరు ప్రాంతాల నుంచి తాడిపత్రికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మరి కొందరు తాటి చెట్ల నుంచి దించిన గెలలను అలాగే తీసుకొచ్చి తాజాగా అప్పటికప్పుడు కాయలు కొట్టి ముంజలు తీసి ఇస్తున్నారు. ఈ సీజన్‌లో అన్ని పండ్లకంటే తాటి ముంజలకు భలే డిమాండ్ ఉంటుంది. డజను తాటి ముంజలు రూ.80 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నారు. పరిసర గ్రామాల్లో కొందరు తాటిచెట్ల నుంచి కాయలు సేకరించి తాడిపత్రికి తీసుకొస్తున్నారు. వేసవిలో పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు వీటిని ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఎండకు వీటిని తీసుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. ప్రతి వంద గ్రాముల తాటి ముంజల్లో 43 కేలరీల శక్తి, 87.6 గ్రాముల నీళ్లతో పాటు విటమిన్లు, ఐరన్, జింక్, పొటాషియం. కాల్షియం. పాస్పరస్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మలబద్ధకాన్ని , వేసవి తాపాన్ని తీర్చడంలో బాగా పనిచేస్తాయి.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

గార్లదిన్నె: రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. గురువారం ఏఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని ఆర్బీకేల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల పొలాల్లో మట్టి నమునాలు సేకరిస్తున్నారన్నారు. సేకరించిన మట్టి నమునాలను అగ్రి ల్యాబ్‌లకు పంపి రిపోర్టు అందజేస్తారన్నారు. భూసార పరీక్ష అనుగుణంగా పంటలు సాగు చేయడం, సూచించిన ఎరువులు వాడితే మంచి దిగుబడులు ఉంటాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాలిటెక్నిక్ వెబ్ కౌన్సెలింగ్‌లో మార్పులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటో నగర్ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో చేపట్టిన వెబ్ కౌన్సెలింగ్ నిర్వహణలో స్వల్ప మార్పులు చేపట్టినట్లు ప్రిన్సిపాల్ శైలేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జూన్ 2 వరకూ ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందన్నారు. అయితే 3వ తేదీ చేయాల్సిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం 6వ తేదీకి మార్పు చేశామన్నారు. అలాగే మే 31 నుంచి ప్రారంభం కావాల్సిన ఆప్షన్స్ నమోదు కార్యక్రమం జూన్ 7 నుంచి 10వ తేదీ వరకూ ఉంటుందన్నారు. 13న ఫలితాలు వెలువడుతాయన్నారు. అలాగే 14వ తేదీ నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

ఆర్టీటీ సెట్ పరీక్షలో 25 మంది ప్రతిభ

యాడికి: ఆర్డీటీ సెట్ పరీక్షలో 25 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తాడిపత్రి ఏరియా కో ఆర్డినేటర్ లలిత గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి మండలాల నుంచి 203 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 25 మంది ప్రతిభ చాటారన్నారు. వారిలో యాడికి మండల కేంద్రంలో ఐదుగురు, చందనలో ఒకరు, రాయలచెరువులో ఇద్దరు, కమలపాడులో ఒకరు, తాడిపత్రి, పెద్దపప్పూరులో మరికొందరు విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు ఎంపికయ్యారన్నారు. వీరిని ఆర్డీటీ చదివిస్తుందన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



గార్లదిన్నెలో మాట్లాడుతున్న ఎంఈఓలు చంద్రానాయక్, వెంకటరమణనాయక్



పెద్దపప్పూరులో వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కవిత

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో గురువారం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు వంటల తయారీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండలవిద్యాశాఖ అధికారులు చంద్రనాయక్, వెంకటరమణనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యంగా అందించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో వంటల తయారీపై శిక్షణ పొందిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు జయమ్మ మెనూలో ఉన్న ఆహారాన్ని ఎలా తయారు చేయాలో శిక్షణ ఇచ్చారు.అనంతరం 44 పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో గురువారం మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం అనంతరం వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీడీఓ కవిత బహుమతులను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరమైన వంటలు అందించాలన్న లక్ష్యంలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఎంఈఓ–2 ఓబులపతి, ఈఓఆర్డీ కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

'పేదల ప్రభుత్వం మరోసారి రాబోతోంది'

గుంతకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని పేదల ప్రభుత్వం మరోసారి రాబోతుందని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ కరోనా సమయంలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా ఉచితంగా విద్య, వైద్యం, ఉపాధి అందించారని గుర్తు చేశారు. సంక్షేమ, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. దీంతో పేదలు, సామాన్యులు అందరూ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ఓటు ద్వారా మద్దతుగా నిలిచారని జోస్యం చెప్పారు. ఐటీ విభాగం నాయకులు బ్రహ్మనందరెడ్డి, దేవేంద్ర, శివశంకర్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టైర్ల అపహరణలో అధికారుల హస్తం?

- రెండేళ్లయినా కొలిక్కి రాని కేసు
- సస్పెండ్‌కు గురైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ప్రతి నెలా జీతం

తాడిపత్రిరూరల్: మున్సిపాలిటీలో అధికారుల లీలలు ఒక్కోటిగా బయటపడుతున్నాయి. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ టైర్ల అపహరణలో బాధ్యుడిని చేస్తూ ఏడాది క్రితం సస్పెన్షన్‌కు గురైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఖాదర్‌కు నెలనెలా జీతాన్ని మంజూరు చేయడం. సాధారణంగా సస్పెన్షన్‌ను ఎత్తి వేసి విధుల్లోకి తీసుకుని జీతం మంజూరు చేస్తారు. కానీ మున్సిపాలిటీలో మాత్రం సస్పెన్షన్‌ను ఎత్తి వేయకుండానే జీతాన్ని మంజూరు చేస్తూ ఆ ఉద్యోగికి అండగా వున్న అధికారి ఎంత మొత్తంలో ముడుపులు తీసుకున్నారోనంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. 2023 ఏప్రిల్‌లో మున్సిపాలిటీని శానిటరీ విభాగపు వాహనాలకు సంబంధించిన 12 టైర్లు అపహరణకు గురయ్యాయి. ఇందుకు బాధ్యుడిని చేస్తూ గోడౌన్ ఇన్‌చార్జ్‌గా వున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఖాదర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. సస్పెండ్‌లో వున్న ఖాదర్‌కు గతంలో కమిషనర్‌గా ఉన్న రవి సూచన మేరకు అకౌంటెంట్ జీతాలను మంజూరు చేస్తున్నారు.





తాడిపత్రి మున్సిపాలిటీ. (ఇన్‌సెట్లో) అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు (ఫైల్)

గుట్టు రట్టవుతుందన్న భయంతోనే జీతం మంజూరు

సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్న మున్సిపాలిటీలో బయటి వ్యక్తులు టైర్లు అపహరించడం అసాధ్యం. మున్సిపాలిటీలోని కొందరు అధికారుల కనుసన్నుల్లో అపహరణ జరిగి ఉంటుందని అనుమానులున్నాయి. ఇదే అనుమానాలను కేసు నమోదు చేసిన పోలీసు అధికారులు విచారణలో భాగంగా స్పష్టం చేశారు. కౌన్సిలర్లు మున్సిపాలిటీలోని వివిధ శాఖల్లో జరిగిన పనులు, కొనుగోళ్లు, తదితర వాటికి చేసిన ఖర్చుకు సంబంధించిన రికార్డులను పరిశీలించడానికి ప్రయత్నించినపుడు.. ఎక్కడ తమ గుట్టు బయట పడుతుందోనన్న భయంతో అధికారులు గోడౌన్‌లో శానిటరీ విభాగానికి సంబంధించిన టైర్లు అపహరణకు గురయ్యాయని హడావుడి చేయడం పోలీసులకు ఇంటి దొంగల పనేనన్న అనుమానాలు బలపడ్డాయి. విచారణలో సైతలం తలతోకా లేని విధంగా వారి సమాధానాలు ఉండటంతో టైర్లు అపహరణకు గురికాలేదని, మున్సిపాలిటీలోని కొందరి హస్తం వల్ల బయటకు తరలించబడ్డాయని అప్పట్లో పోలీసులు అనుమానాలను వ్యక్తం చేశారు., మరోవైపు బయటకు తరలిపోయిన టైర్ల స్థానంలో కొత్తవాటితో నింపడానికి 2022 ఆగస్టు 25న జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.మూడు లక్షలు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. ఎప్పుడు తమపై పోలీసు అధికారులకు అనుమానం వచ్చిందో అప్పటి నుంచి వివిధ రకాల ఒత్తిళ్ల ద్వారా కేసు విచారణను మందగింపచేసి.. చివరికి అటకెక్కించే ప్రయత్నం చేశారు. రెండేళ్లవుతున్నా అసలైన నిందితులను గుర్తించడంలో పోలీసులు విఫలం కావడంతో పాటు అపహరణకు గురైన టైర్ల రికవరీ జరగలేదు. దీంతో ఆర్థిక సంక్షోభంలో ఉన్న మున్సిపాలిటీకి కొత్త టైర్ల కొనుగోలు కోసం అదనపు భారం పడినట్లయింది. కేవలం టైర్ల అపహరణతో పాటు చేసిన అక్రమాలు, అవినీతి బయట పడకుండా ఉండేందుకు సస్పెండ్‌కు గురైన ఉద్యోగికి ప్రతినెలా జీతం ఇస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అబ్దుల్

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసముండే అబ్దుల్ అనే యువకుడు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.